క్లుప్తంగా

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాం పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఆయన సిబ్బందిచే గోదాం సీల్‌ను తెరిపించి, లోపల ఉన్న వీవీ ప్యాడ్‌లు, ఈవీఎం బాక్సులను పరిశీలించారు. అలాగే గోదాంలోని సీసీ కెమెరాల పనితీరును కూడా తనిఖీ చేశారు. గోదాం భద్రతా ప్రమాణాలు పటిష్టంగా ఉండాలని, భద్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట రూరల్ తహసీల్దారు పాల్‌కిరణ్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సహజ వాతావరణాన్ని పరిరక్షించాలి



ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ తీరప్రాంత దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఆదాని గంగవరం పోర్ట్ ఆధ్వర్యంలో తీరప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ సహజ వాతావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన నగర పౌరులతో కలిసి సముద్ర తీరంలోని వ్యర్థాలను తొలగించారు. కలెక్టర్ ఎం.ఎస్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. తీర ప్రాంతంలో పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు, సముద్ర వ్యవస్థను సంరక్షించే బాధ్యతపై ప్రజలను చైతన్యవంతం చేసే విధంగా కృషి చేస్తున్నట్లు గంగవరం పోర్ట్ ప్రతినిధులు తెలిపారు.

పాత వెంకోజిపాలెంలో మహా అన్నదానం



వడ్డన చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని పాత వెంకోజిపాలెంలో, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని, భక్తులకు అమ్మ ప్రసాదం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, వారంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఒమ్మి అప్పారావు, ముత్యాల రాజు, పల్లా శ్రీనివాస్, పల్లా చిన్నారావు, పల్లా అప్పలరాజు, నమ్మి చిన్న, పెంటరావు, ఒమ్మి రవి, పల్లా శివ, ఒమ్మి కోటి, కన్నారావు, పల్లా ప్రసన్న, పల్లా గోపి, ప్రసాద్, ఉమా, వంశీ, మొగ్గయ్య, వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీసీఐఎల్ ఆధ్వర్యంలో బీచ్‌క్లీనింగ్



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న డీసీఐఎల్ అధికారులు, ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్) ఆధ్వర్యంలో తెన్నేటి పార్క్ బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛోత్సవ్–2025 ఏక్ దిన్, ఏక్ సాథ్, ఏక్ గంట కార్యక్రమంలో భాగంగా సంస్థ ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబై పోర్ట్ వీపీఏ, డీసీఐఎల్ చైర్మన్ డాక్టర్ మధైయాన్ అంగముత్తు, డీసీఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ దుర్గేష్‌కుమార్ దూబేల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగ్గా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు ఉత్సాహంగా పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు.

మనల్ని ఆపేది ఎవరు?



22వ వార్డులో గుంపులుగా వీధి కుక్కలు

- మా జోలికొస్తే ఎవర్నీ వదలం
- గుంపులుగా వస్తాం..కాటేస్తాం
- జీవీఎంసీ పాలక వర్గాన్ని సవాల్ చేస్తున్న శునక బృందం

స్మార్ట్ సిటీ విశాఖలో ప్రస్తుతం 'ఆపరేషన్ డాగ్స్'కు బదులు.. అర్థం లేని 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో హడావుడి చేస్తున్న జీవీఎంసీ తీరుపై శునకాలు తీవ్ర వ్యంగ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈమేరకు ఓ జంక్షన్‌లో భేటీ అయ్యాయి. జీవీఎంసీ తీసుకుంటున్న చర్యలపై విశ్లేషించాయి.

టామీ (శునకాలకు హెడ్): 'అరేయ్ జూలీ, ఈ స్మార్ట్ సిటీ గురించి ఏం అనుకుంటున్నావ్?'

జూలీ (కుక్కపిల్ల): 'అంకుల్, జీవీఎంసీ వాళ్లు మనల్ని అస్సలు పట్టించుకోవడం లేదు కదా! వీళ్లకు 'ఆపరేషన్ లంగ్స్' తెలుసు కానీ, అసలు నగరంలో చేయాల్సిన 'ఆపరేషన్ డాగ్స్' గురించి తెలియదు.'

జానీ (రౌడీ షీటర్ డాగ్): 'మనల్ని ఎవడ్రా ఆపేది! మనం రోడ్డు మీద కాళ్లు మీద కాళ్లు వేసుకుని పడుకున్నా, ఏకంగా మనుషుల కాళ్లను కరిచినా... వాళ్లు చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు. నిజంగా మన రాజధాని విశాఖనే! అందుకే నేను దారిలో పోయే వాళ్లను చూసి గట్టిగా భౌ! అంటున్నా. మమ్మల్ని ఎవడ్రా ఆపేది!'

టామీ: 'హెహే! నువ్వు చెప్పింది నిజం జానీ. వాళ్లు 'స్మార్ట్ సిటీ' అని గొప్పలు చెప్పుకుంటారు కానీ, కనీసం వీధుల్లో శునకాల ఫ్రీడమ్‌ను అడ్డుకునే సాహసం కూడా చేయలేకపోతున్నారు. పేదల పొట్ట కొట్టడంపై ఉన్న శ్రద్ధ, మాకు 'సెంట్రల్ ఏసీ బెడ్' ఏర్పాటు చేయడంపై లేదు.' ఇటీవల సీఎం గారూ పశువులకు హాస్టల్ పెడతామని ప్రకటించారు. మరి మా సంగతి ఏంటీ అధ్యక్షా...అంటూ సభాముఖంగా ప్రశ్నిస్తున్నా....?

జూలీ: ఉండన్నా...ఇటువైపు ఎవడో హుషారుగా వస్తున్నాడు...వాడ్ని ఒకసారి భౌపెడదాం...ముక్క ఇస్తే సరి లేదంటే పిక్కపట్టి లాగేద్దాం...అంటూ మీటింగ్ ముగించాయి.

మొత్తానికి..విశాఖలో కుక్కల దర్బార్ నడుస్తోంది. నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని శునకాలు కూడా వ్యంగ్యంగా ఎత్తి చూపుతున్నాయి. కుక్కల బెడదపై నగర ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మద్దిలపాలెం : నగరంలోని జీవీఎంసీ 22, 23వ వార్డులలోని పీతవానిపాలెం, శివాజీపాలెం, లక్ష్మీనగర్ ప్రాంతాలు వీధి కుక్కల బెడద తీవ్రమైంది. చీకటి పడగానే కుక్కలు గుంపులు గుంపులుగా చేరి అరుస్తూ, కాలనీవాసులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి.రోడ్లకు అడ్డంగా పడుకోవడంతో పాటు, ద్విచక్ర వాహనాల వెనుక, ఒంటరిగా వచ్చే వ్యక్తుల వెనుక కుక్కలు వెంటాడటం వల్ల జనం భయపడుతున్నారు. ఈ వెంబడింపుల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు.



23వ వార్డులో రహదారిపై వీధి కుక్కలు

అధికారుల నిర్లక్ష్యం

అర్ధరాత్రి వేళల్లో కుక్కల అరుపులతో ఇబ్బందులు పెడుతున్నా, ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు డిమాండ్

వీధి కుక్కలను పట్టుకుని, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి, రేబిస్ వ్యాక్సిన్లు వేయించి దూరంగా విడిచిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. అయితే, ఖర్చుతో కూడిన చర్య కావడంతో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

బయటకు రావాలంటే భయంగా ఉంది

మావీధిలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇళ్ల వెళ్లే మార్గ మధ్యలో తిష్టవేస్తున్నాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉంటే ఎక్కడ కరుస్తాయోనని భయపడుతున్నాం. అర్ధరాత్రి వేళల్లో అరుపులతో హడలెత్తిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయపెడుతున్నాయి.
– కృష్ణప్రసాద్, లక్ష్మీనగర్ కాలనీ (22వవార్డు)


వాహనాలు వెంబడిస్తున్నాయి

ద్విచక్రవాహనాలపై వెళ్తుంటే వాటి వెనుక పరుగులు పెడుతున్నాయి. ఎక్కడ కరుస్తాయోమోనని ఆందోళనగా ఉంది. వీధిలో కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలి. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.
– హరీష్, శివాజీపాలెం

డాగ్ క్యాచర్స్ బలోపేతం చేయాలి

వీధులలో కుక్కలు ఎక్కువగా ఉండడంతో ఒంటరిగా రావడానికి భయపడుతున్నాం. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కుక్కలు పట్టేవాళ్లు వచ్చినా...ఒకటి రెండు శునకాలను పట్టుకుంటే..మిగిలినవి పారిపోతున్నామి. మళ్లీ వాటిని పట్టుకునేందుకు సిబ్బంది రావడం లేదు.
– శ్రీదేవి, మద్దిలపాలెం

చండికాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



ప్రత్యేక అలంకరణలో చండికా దేవి అమ్మవారు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా, శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కల్పన, వీరవేణుల పర్యవేక్షణలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిగింది. ఈ పూజల్లో స్థానిక మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, స్థానికులను ఎంతగానో అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో అమ్మవారికి చండీ హోమంతో పాటు కుంకుమ పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. అలాగే సాయంత్రం భజన బృందాలు, కోలాట బృందాలతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహన్‌రావు, వెంకటరావు, టీఎన్ మూర్తి, రామకృష్ణ, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్‌లో అంధకారం



ధారపాలెం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులో వెలగని వీధి దీపాలు



రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్ రహదారిలో వెలగని వీధి దీపాలు



ముడసర్లోవ ప్రాంతం దీన్‌దయాళ్‌పురం వద్ద బీఆర్‌టీఎస్‌లో అంధకారం

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు ఆనుకుని హనుమంతవాక కూడలి నుంచి అడవివరం వరకు కొద్ది రోజులుగా పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. సుమారు 9 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డులో శుక్రవారం సగానికిపైగా ప్రాంతం పూర్తిగా చీకటిమయమైంది. చినగదిలి నుంచి ముడసర్లోవ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ, దారపాలెం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో ఏ లైన్‌లోనూ విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనచోదకులు వాహనాల లైట్ల వెలుగులోనే ప్రయాణించాల్సి వచ్చింది. చీకటి కారణంగా ఎదురుగా వచ్చే వాహనాల లైట్లు కళ్లలో పడి, సరిగా నడపలేక ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు వెంటనే మరమ్మతులు జరిపించి, అన్నిచోట్లా వీధి దీపాలు వెలిగించాలని వారు కోరుతున్నారు.

రామకృష్ణాపురంలోనూ అంధకారమే..

జీవీఎంసీ 13వ వార్డు పరిధిలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని ఉన్న రామకృష్ణాపురంలో కూడా శుక్రవారం వీధి దీపాలు వెలగలేదు. దీనికి సమీపంలోని దేవస్థానం స్థలంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని వేయడానికి అధికారులు గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో గ్రామస్తులు రాత్రంతా అంధకారంలో ఇబ్బందులు పడ్డారు.

అమ్మవారికి మాజీ మేయర్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి



డెయిరీఫారం వద్ద అమ్మవారిని నోట్లతో అలంకరణ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాబజార్, టి.ఐ.సి పాయింట్, పాత ఆరిలోవ, గాంధీనగర్, రవీంద్రనగర్, పాత డెయిరీఫారం, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వంటి పలు ప్రాంతాలలో దుర్గామాత మండపాలు ఏర్పాటు చేశారు. భక్తులు నిత్యం అమ్మవారి పూజలలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. శుక్రవారం ఆయా మండపాలలో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించారు. గాంధీనగర్‌లో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పాత డెయిరీఫారం వద్ద అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించడం విశేషం. రూ.10, 20, 50, 100, 200, 500 నోట్లతో నిర్వాహకులు చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఏటీఆర్, సరోగసీ దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎస్ హరేందిర ప్రసాద్. చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: కలెక్టర్ ఎంఎస్ హరేందిర ప్రసాద్ అధ్యక్షతన ఏఆర్‌టీ, సరోగసీ చట్టం అమలుపై శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఆర్‌టీ, సరోగసీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ సామిని, పిల్లల వైద్యురాలు డాక్టర్ రత్నకుమారి, రేడియాలజిస్టు డాక్టర్ శ్రీకాంత్, పలు విభాగాల వైద్యులు డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో)బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పి.రమేష్‌బాబు, జి.మల్లేశ్వరి, ఎల్.వి.రమణి, ఎస్.సాయి రోహిత్, కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దసరా సంబరాలు



కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సమతి డిగ్రీ, పీజీ కళాశాలలో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా, మహాలక్ష్మీ అవతారంలోని అమ్మవారికి కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విజయరవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ వేడుకలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మీదేవి కటాక్షం కళాశాల విద్యార్థులందరికీ ఉండాలనే లక్ష్యంతో ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులలో భక్తిభావాలు, సంప్రదాయాలపై అవగాహనను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు అమ్మవారి పదకొండు అవతారాల వేషధారణలో ఆకట్టుకున్నారు. కోలాటం, బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కూడా ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



సూచనలు చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ 18వ వార్డ్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం పర్యటించారు. వార్డ్‌లోని పలు ప్రాంతాలను సందర్శించిన ఆయన, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా ఏఎస్ రాజా కూడలి ఫుట్‌పాత్‌లపై తొలగించిన బడ్డీల ప్రాంతంలో పేరుకుపోయిన 'డెబ్రీస్'ను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు పలు సూచనలు చేశారు.

అనంతరం కమిషనర్ శానిటరీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. వారు ఎన్ని గంటలు పనిచేస్తున్నారు, ఏఏ వీధుల్లో పారిశుద్ధ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆరాతీశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–3 అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

- ఏయూ విద్యార్థి మృతి..ప్రభుత్వ వైఫల్యమే..
- సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ చదువుతున్న విద్యార్థి మణికంఠ మృతిపై సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి. కృష్ణారావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ మరణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఇది సహజ మరణం కాదని, విశ్వవిద్యాలయ వ్యవస్థలోని లోపాల వల్ల జరిగిన 'వ్యవస్థాగత మరణం' అని ఆరోపించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం విశ్వవిద్యాలయం డిస్పెన్సరీ, అంబులెన్స్‌లో కేవలం ఆక్సిజన్ లేని కారణంగా ఏయూలో బీఈడీ చదువుతున్న విద్యార్థి మణికంఠ మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి విశ్వవిద్యాలయంలో బోధనా, బోధనేతర ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించటం మానేసిందని పేర్కొన్నారు. యూనివర్సిటీ నిధులు యూనివర్సిటీ విద్యార్థులకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనం కోసం ఉపయోగించడం లేదని ఆరోపించారు. హాస్పిటల్‌లో ఆక్సిజన్ లేదంటే ఇది ప్రభుత్వం వైఫల్యం కాదా అని ప్రశ్నించారు.

'కన్యాకుమారి' సందడి

విద్యార్థినులతో హీరోయిన్ గీతా సైనీ ముచ్చట్లు



విద్యార్థినులతో కలసి లవ్ సింబల్ చూపిస్తున్న హీరోయిన్

మధురవాడ: 'కన్యాకుమారి'సినిమా హీరోయిన్ గీతా సైనీ, డైరెక్టర్ సృజన్ అట్టాడ శుక్రవారం మధురవాడలో సందడి చేశారు. సినిమా ఓటీటీ ప్రమోషన్‌లో భాగంగా మధురవాడలోని గాయత్రి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హీరోయిన్ విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. అలాగే కొన్ని డైలాగులు చెప్పి అందరినీ అలరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సినిమాలో మెసేజ్ ఇచ్చినట్లు.. విద్యార్థులందరూ తమ కంటూ ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, భవిష్యత్తులో మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

అక్టోబర్‌లో షాపింగ్ ఫెస్టివల్

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నాలుగు వారాల ప్రణాళికను అమలు చేస్తున్నామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. శుక్రవారం, సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'అనే నెల రోజుల కార్యక్రమం, సీజనల్ కండీషన్స్, పీఎం కుసుమ్ పథకం, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రారంభమైందని, 25 నుంచి 29 వరకు పొదుపు అంశాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవసాయం, ఇతర వృత్తులపై వారికి, 7 నుంచి 13 వరకు విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితరాల గురించి వివరిస్తామన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, పునరుత్పాదక శక్తి, ఆటోమొబైల్స్ మొదలైన అంశాలపై అవగాహన, షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్‌కు సంబంధించి 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరుపక్కలా చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ ఆపరేషన్ బి.సింహాచలం నాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, షిర్డీ సాయినగర్, వెటర్నరీకాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, తోటగరువు ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.